

**రోడ్డుకు అడ్డంగా గోడ**
పాత కక్షల కారణంగా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించి. అడ్డుకున్న సంఘటన పుత్తూరులో జరిగింది.
- 8లో



**పంపిణీ అయోమయం**
విద్యాశాఖకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.
- 8లో



**గరుడుడిపై కోదండరాముడు**
తిరుపతిలోని కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడ వాహనంపై ఊరేగారు.
- 8లో

## న్యూస్‌రీల్

### నేడు యథావిధిగా పది సోషల్ పరీక్ష

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన ఆప్షనల్ సెలవు ప్రకటించినప్పటికీ పదో తరగతి సోషల్ పరీక్ష యథావిధిగా నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మంగళవారం పదో తరగతి సోషల్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష విషయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు.

### బోయకొండ గంగమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి రోజాక్షికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈఓ

**చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మను కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రోజాక్షి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం స్వాగతం పలికారు. న్యాయమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. పూజల అనంతరం పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి, సత్కరించారు.

### పకడ్బందీగా పింఛన్ల పంపిణీ



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏప్రిల్ ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,65,067 మంది పింఛన్‌దారులకు రూ.112.79 కోట్లు ఏప్రిల్ నెల పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 100 శాతం పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది మంగళవారం తప్పనిసరిగా ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. ఎక్కడా ఏ చిన్న పొరబాటు లేకుండా పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేపట్టాలన్నారు. గత నెలలో వివిధ కారణాలతో పింఛన్లు తీసుకోని లబ్ధిదారులకు ఈ నెలలో మొత్తం పింఛన్ నగదు అందజేయాలన్నారు. ఎక్కడైనా పొరబాట్లు జరిగితే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

### పెరిగిన టమాట ధరలు

- పలమనేరులో బాక్సు రూ.300



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

**పలమనేరు:** స్థానిక టమాట మార్కెట్‌లో టమాట ధరలు పెరిగాయి. సోమవారం 15 కిలోల బాక్సు ధర రూ.110 నుంచి రూ.300 వరకు పలికింది. మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, స్థానిక కార్యదర్శి సంజీవకుమార్ స్థానిక టమాట వ్యాపారులు, మండీ యజమానులతో మాట్లాడి ధరలు పెరిగేలా చూడాలని సూచించారు. దీనికి తోడు పలు రాష్ట్రాల నుంచి టమాట వ్యాపారులు కొనుగోళ్ల కోసం మార్కెట్‌కు రావడంతో ధర పెరిగింది. మరోవైపు అనంతపురం నుంచి సరుకు తగ్గడమే ధరల పెంపునకు కారణమైందన్న మాట వినిపిస్తోంది.

### నేడు యథావిధిగా పాఠశాలలు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఈ నెల ఒకటో తేదీన యథావిధిగా నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈదుల్ ఫితర్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీన ఆప్షనల్ సెలవును ప్రకటించిందన్నారు. అయితే జిల్లాలో నిబంధనల ప్రకారం ఐదు ఐచ్ఛిక సెలవులను ముందుగానే వినియోగించుకున్నారన్నారు. దీంతో మంగళవారం జిల్లాలోని పాఠశాలలు సెలవు ఇవ్వడానికి వీలులేదన్నారు. పాఠశాలలు యథావిధిగా నిర్వహించాలని ఆదేశించారు.

---



# నాటి సర్కారు శైలి..
# కట్టడికి మజిలీ

రాష్ట్ర ప్రజల ప్రాణరక్షణే ధ్యేయం.. కరోనా కట్టడే దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పట్లో ముందుకు సాగింది. ఫీవర్ సర్వేలు చేసింది.. రెడ్ జోన్‌లు ప్రకటించి, ప్రజలను అప్రమత్తం చేసింది. అందరిలోనూ మార్పునకు కృషి చేసింది. ఏకరూపత సాధించింది. ఫలితంగా కరోనాకు అడ్డుకట్ట పడింది. ఆ సేవలు నేటికీ మరువలేమంటూ జనం గుర్తుతెచ్చు కుంటున్నారు. మార్చి నెలకు కరోనా వచ్చి ఐదేళ్లు.

- ఐదేళ్ల కిందట గడగడలాడించిన కోవిడ్
- వేలాది మంది ప్రాణాలు బలి తీసుకున్న వైరస్
- జిల్లాలో వీధిన పడిన వేల కుటుంబాలు
- వైరస్ కట్టడికి అహర్నిశలు శ్రమించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

**కాణిపాకం:** ప్రపంచాన్నే గడగడలాడించిన మహమ్మారి కరోనా కట్టడికి అప్పటి వైఎస్సార్ సీపీ సర్కారు చిత్తశుద్ధితో దేశంలోనే అత్యున్నత సేవలు అందించడంతో కట్టడి సాధ్యమైంది. మరణాల రేటు రాష్ట్రంలో తగ్గింది. కరోనా విపత్తు జనాన్ని అతలాకుతలం చేసింది. ఎవరిని తాకితే ఏమవుతుందో.. ఏం తింటే ఏమైపోతామో అన్న భయం అందరినీ వెంటాడింది. చికిత్స ఎలా, మందులు ఏమిటి అన్న విషయం తెలియక వైద్యులు సతమతమైన తరుణంలో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఆ వైరస్ పేరు కరోనా. ఆ భయానక అనుభవం ఎదురై ఐదేళ్లు కావొస్తుండగా.. ఇప్పటికీ ఆ రోజులు గుర్తుకొస్తే వైరస్ బారిన పడిన కుటుంబాలు విలవిల్లాడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో తొలి కరోనా కేసు 2020 మార్చి 24వ తేదీన శ్రీకాళహస్తీలో నమోదైంది. అంతకుముందు మార్చి 20వ తేదీకి పైగా ప్రభుత్వం లాక్‌డౌన్ విధించగా జనజీవనం స్తంభించింది. రాకపోకల నిలిపివేతతో ఎక్కడి వారు అక్కడే ఉండిపోగా.. ఉపాధి కరువై, ఇళ్లలో సామగ్రి లేక పలువురు ఆకలితో అలమటించారు. రవాణా వ్యవస్థ స్తంభించింది. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, పార్టీ నాయకులు నిత్యావసరాలు పంపిణీ చేసి ఆదుకున్నారు.

**ఉమ్మడి జిల్లా కరోనా వివరాలు**

| వేవ్ | పరీక్షలు | పాజిటివ్ కేసులు | మరణాలు |
|---|---|---|---|
| ఫస్ట్ వేవ్ | 1154981 | 89921 | 858 |
| సెకండ్ వేవ్ | 2260913 | 164296 | 1115 |
| థర్డ్ వేవ్ | 152105 | 23568 | 43 |
| 2022 ఆగస్టులో | 11278 | 456 | 01 |

**ప్రభుత్వ కిట్లతో రక్షణ**

కోవిడ్ మొదటి వేవ్‌లో ప్రభుత్వమే ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టులు నిర్వహించింది. దీంతో ప్రజలు తమకు ఏ చిన్న లక్షణం కనిపించినా పరీక్ష చేయించుకోవడం.. ఆపై ప్రభుత్వం ఇచ్చే కిట్ తీసుకుని, అందులోని మందులు వాడేవారు. కొందరైతే సొంతంగా ఐసోలేషన్‌లో ఉంటూ కుటుంబాలకు దూరంగా గడిపారు.

**తొలివేవ్..**

కరోనా మొదటి వేవ్ 2020 మార్చి నుంచి 2021 మార్చి వరకు కొనసాగింది. అప్పటి యంత్రాంగం ఎంత కష్టపడినా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట పడలేదు. లాక్ డౌన్ సడలింపు వేళలో ప్రజలు నిత్యావసరాల కోసం రావడం, ఇతర ప్రాంతాలకు వెళుతుండడం.. ఆ సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో కేసులు గణనీయంగా పెరిగాయి. మొదటి వేవ్‌లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ టెస్టులు 11,54,981మందికి నిర్వహించగా 89,921 మందికి కరోనా నిర్ధారణ అయ్యింది. అయితే ఇంటి వద్ద చికిత్స చేయించుకున్న వారు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకున్న వారితో కలిపితే ఈ లెక్కలు మరింత పెరుగుతాయి. కాగా మొదటి వేవ్‌లో కరోనా వ్యాక్సిన్ రావడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. తొలుత ఫ్రంట్‌లైన్ వారియర్లకు వ్యాక్సిన్ అందించిన ప్రభుత్వం.. ఆ తర్వాత అందరికీ ఇవ్వడానికి రెండేళ్లు పట్టింది.

**మరణాలు.. 2017**

కరోనా మూడు వేవ్‌లో ప్రభుత్వ వరంగా 35,79,277 మందికి ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా 2,78,241 మంది కోవిడ్ బారిన పడినట్లు తేలింది. ఇందులో 2,017 మంది మాత్రమే మృతి చెందినట్లు అధికారికంగా లెక్కలు చూపారు. 2022 జూన్‌లో 11,278 మందికి పరీక్షలు చేయగా 456 మందికి కోవిడ్ సోకగా ఒకరు మాత్రమే మృతి చెందారు. అప్పటికే అందరూ రెండు డోస్ వ్యాక్సిన్ వేసుకుని ఉండడం.. కరోనాకు అన్ని వ్యాధుల మాదిరి చికిత్స సాధారణంగా మారడంతో 2023 నుంచి కోవిడ్ ప్రభావం పూర్తిగా క్షీణించింది.

**రెండో వేవ్..**

కోవిడ్ రెండో వేవ్ 2021 మార్చిలో ప్రారంభం కాగా డిసెంబర్ వరకు కొనసాగింది. ఈ వేవ్‌లో ఉమ్మడి జిల్లా ప్రజలు ఎక్కువ అల్లాడిపోయారు. కోవిడ్ సోకిన రెండు, మూడు రోజులకే కొందరు మృతి చెందడమే కాక వృద్ధుల మరణాలు గణనీయంగా నమోదయ్యాయి. చాలాచోట్ల ఆక్సిజన్ కొరత ఏర్పడింది. ఇదే సమయం కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో మృతుల అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబసభ్యులు సైతం ముందుకు రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రెండో వేవ్‌లోనే కరోనాకు రెమిడిసీవర్ ఇంజక్షన్ అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగానే సరఫరా చేసినా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలల్లో అమ్ముకున్నారు. ఆపై వచ్చిన ఆవేవ్‌లు ప్రజలకు అంతా ప్రభావం చూపలేదు. దీంతో ప్రజలు సైతం భయం వీడి భయటకు వచ్చారు.

**నిర్భయంగా ప్రసవాలు చేశాం**



కోవిడ్ సమయంలో జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా ప్రసవాలు చేశాం. ఓడీగా ఉన్నా, వైద్యులు, సిబ్బంది కోవిడ్ బారిన పడినా ప్రసవాలు నిర్వహించాం. కోవిడ్ బారిన పడిన వందలాది మంది గర్భిణులకు ప్రసవాలు చేశాం. సురక్షితంగా ఇంటికి పంపాం. అప్పట్లో డాక్టర్లు, సిబ్బంది కోవిడ్‌కు భయపడకుండా ప్రాణాలే ముఖ్యంగా ముందుకు వచ్చారు. ఆరోజులను మర్చిపోలేం.
– ప్రభావతి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

**అందరి సహకారంతోనే...**



కోవిడ్ కేసులు తొలి, రెండో దశలో ఆస్పత్రిని చుట్టిముట్టేశాయి. అప్పటికప్పుడు పడకలు, వారికి అవసరమైన వసతులను సమకూర్చాం. ఇబ్బంది లేకుండా చూశాం. రికవరీ చేసి పంపాలన్న లక్ష్యంతో పనిచేశాం. చాలా మంది ఇళ్లువాకిళ్లు వదిలి డ్యూటీలు చేశారు. ప్రాణాలను పణంగా పెట్టారు. ఎందరో ప్రాణాలు నిలిపామన్న సంతృప్తి మాకు మిగిలింది. వైద్యులు, సిబ్బంది అలాంటి అనుభవం మరెప్పుడూ రాదు
– అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

## కరోనా కట్టడికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏం చేసిందంటే...

కరోనా వ్యాప్తితో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వలంటీర్ల సేవలను వినియోగించుకుంది. బయట రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే వారిని పసిగట్టింది. వారికి కరోనా లక్షణాలుంటే ఆరాతీసేది. అలాగే వారికి ఎవరెవరూ ఎవరిని కలిసారో వారందరిని కూడా గుర్తించి పకడ్బందీగా వ్యవహరించింది. వారికి కోవిడ్ పరీక్షలు చేసి కరోనా పాజిటివ్ కేసులను జల్లెడ పట్టేది. ఇంటి నుంచి 14 రోజుల పాటు బయటకు రాకుండా చూసింది. తగిన వైద్య సేవలను అందించింది. పాజిటివ్ వచ్చిన ప్రాంతాలు, వీధులకు రెడ్ జోన్ ప్రకటించి ప్రజలకు అలెర్ట్ చేసింది. వారం వారం వదలకుండా వైద్యసిబ్బంది, వలంటీర్ల ద్వారా ఫీవర్ సర్వేలు చేయించేది. తద్వారా కొన్ని కేసులు బయటపడ్డాయి. అలా వచ్చిన కేసులకు ఇంటి దగ్గరికి వెళ్లి వైద్య బృందం కోవిడ్ పరీక్షలు చేసేవారు. ఆస్పత్రులకు కావాల్సినన్ని మందులు, మాత్రలు అందజేసింది. కోవిడ్ బాధితులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలను అందించింది. ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున్న ఆర్థికసాయం చేసింది. ఇక ఉచితంగా బియ్యం పంపిణీ చేపట్టింది. కోవిడ్ సెంటర్లల్లో మంచి పౌష్టికాహారాన్ని అందించి, బాధితులకు కొండంత భరోసా నిచ్చింది. ఇలా పలు రకాలుగా ఏ రాష్ట్రంలో చేయలేనంతగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు కోవిడ్ సేవలు చేసింది. ఈ సేవను మర్చిపోలేమని ప్రజలు గుర్తు చేస్తున్నారు. కాగా ఈ కోవిడ్ కట్టడిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములై ఫ్రంట్ వారియర్‌గా నిలిచారు.

---

# బాసూ.. ఏంటిది..?



చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయం

**వరమా..! శాపమా..?**

- ఆర్నెళ్లకుపైగా వేకెంట్ రిజర్వులో పోలీసులు
- స్టేషన్ డ్యూటీలు లేక.. బందోబస్తుకు పరిమితం
- దొంగ నుంచి డబ్బులు కొట్టేసిన వాళ్లకు స్టేషన్ విధులు
- 'బాస్' ముందు వాస్తవాలు పెట్టలేకున్న 'ప్రత్యేక' విభాగం

**చిత్తూరు అర్బన్:** వేకెంట్ రిజర్వు.. దీన్నే వీఆర్ అంటారు. పోలీసు శాఖలో బహుశా ఈ పదం తెలియనివాళ్లు ఉండరు. కానిస్టేబుల్ నుంచి అదనపు ఐపీఎస్ అధికారి వరకు పలు సందర్భాల్లో వీఆర్‌కు వెళ్లాల్సిందే. ఒకప్పుడు వీఆర్ అంటే వణికిపోయే వాళ్లు. ఏదో క్షమించరాని తప్పు చేసిన వాళ్లను వీఆర్‌కు తీసుకున్నారని దోషులుగా చూసేవాళ్లు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఐజీ స్థాయి నుంచి ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు స్థాయిలో రాష్ట్రంలో 199 మంది పోస్టింగుల్లేక వీఆర్‌లో ఉన్నారు. చిత్తూరు జిల్లాలోనూ ఈ పరిస్థితి కొనసాగుతోంది. కాకపోతే ఓ చిన్నస్థాయి కానిస్టేబుళ్లు నెలల తరబడి పోస్టింగుల కోసం ఎదురుచూస్తూ వీఆర్‌లో కాలం నెట్టుకొస్తున్నారు.

**ఏం చేశారో కూడా తెలియక..**

చిత్తూరు పోలీసు జిల్లాలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఇలా మొత్తం 17 మంది వరకు వీఆర్‌లో ఉన్నారు. కాణిపాకం, వెదురుకుప్పం, చౌడేపల్లె, గంగాధరనెల్లూరు, యాదమరి, బైరెడ్డిపల్లె తదితర పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు సిబ్బందిలో కొందరు నాలుగు నెలలుగా, మరికొందరు ఏడు నెలలుగా వీఆర్‌లో ఉన్నారు. ప్రతీరోజూ ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్ఎస్ఐ వద్దకు వెళ్లి రిపోర్టు చేయడం.. ఆ రోజు ఎవర్ని ఎక్కడకు పంపాలో విధులు కేటాయించడం జరుగుతోంది. కొందరు అధికారుల ఇళ్ల వద్ద సెక్యూరిటీ గార్డులుగా, మరికొందరు ఖైదీలకు ఎస్కార్టులు, ఇంకొందరు బందోబస్తు డ్యూటీలు చేస్తున్నారు. వీఆర్‌లో ఉన్న ప్రతి ఒక ఖాకీ అడిగే ఒకే ఒక్క ప్రశ్న.. 'మేమేం తప్పు చేశాం..? ఎందుకు మమ్మల్ని ఇన్నాళ్లు వీఆర్‌లో పెట్టారు..?' ఈ ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. ఎందుకంటే వీఆర్‌లో ఉన్న వాళ్లల్లో కొందరిపై ఆరోపణలుంటే, మరికొందర్ని ఎందుకు ఇక్కడ ఉంచారో కూడా తెలియని పరిస్థితి. ఒకవేళ తప్పు చేస్తే తండ్రి స్థానంలో ఉన్న 'బాస్' మందలించో, శిక్ష వేసో, హెచ్చరించో విధులు కేటాయిస్తే చాలని వేడుకుంటున్నారు.

**చట్టం చుట్టమా..?**

ఇదే చిత్తూరు జిల్లా పోలీసుశాఖలో ఓ దొంగను పట్టుకున్న ఇద్దరు పోలీసులు, ముగ్గురు సిబ్బంది కలిసి ఏకంగా రూ.12.50 లక్షలు లంచం తీసుకున్నారనే ఆరోపణలు ఆ శాఖను కుదిపేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే విచారణ పూర్తయ్యి, నివేదిక అధికారుల వద్ద ఉన్నా ఏం చర్యలు తీసుకున్నారని జిల్లాలోని వేలాది మంది పోలీసు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన పాపానికే తాము వీఆర్‌లో ఉంటే, అదే ఆరోపణలు వచ్చిన వాళ్లు దర్జాగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుంటే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం ఎలా ఏర్పడుతుందని నిర్భయంగా కడిగేస్తున్నారు. చిత్తూరులో చోరీ చేసిన దొంగ రాయచోటి పోలీసులకు పట్టుబడడంతో ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం దొంగను అన్నమయ్య జిల్లా పోలీసు అరెస్టు చేసినట్లు సమాచారం. అయితే రూ.12.50 లక్షలు కాజేసిన పోలీసులు, దాదాపు రూ.8 లక్షల సొమ్మును దొంగకు తిరిగి ఇచ్చేసినట్టు, దాన్నే పోలీసులు రికవరీగా చూపించారనే గుసగుసలు చక్కర్లు కొడుతున్నాయి. ఇంతటితో విచారణ కూడా అటకెక్కినట్లేనని విమర్శలు గుప్పుమంటోంది.

**ఏమీ చెప్పరా..!**

జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, పోలీసుల పనితీరు, రాజకీయ కోణం, పాత నేరస్తులపై నిఘా.. ఇలా ప్రతి ఒక అంశం పోలీసు 'బాసు'కు తెలియడంలో 'ప్రత్యేక' విభాగం కీలకంగా వ్యవహరించాలి. కానీ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో ప్రతి రోజూ 'బాస్' హోదాలో ఉన్న వ్యక్తి వద్ద మాట్లాడడానికి వెనకడుగు వేస్తున్నారు. దొంగల వద్ద డబ్బులు గుంజేసిన విషయం తెలిసినా, చిత్తూరులో క్రికెట్ బెట్టింగులు, పేకాట, కొందరు ఖాకీల కనుసన్నల్లో జరుగుతున్న వ్యభిచార గృహాలు, స్టేషన్లలో సీజ్ చేసిన వాహనాలను రోడ్లపై తిప్పుతున్న ఖాకీలు, ఇన్‌స్పెక్టర్ల వద్ద డ్రైవర్లుగా చెలామణి అవుతూ రోజువారీ కలెక్షన్లు చేసే వ్యక్తుల వివరాలన్నీ కూడా తెలిసినా 'ప్రత్యేక' అధికారులు నోరు తెరవకపోవడం వీళ్లకే చెల్లు.

### కుమారుడు, కోడలిపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

**చౌడేపల్లె:** వృద్ధ దంపతులపై దాడి చేసిన కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోట పల్లెకు చెందిన వృద్ధ దంపతులు చిన్నప్పరెడ్డి, రాజమ్మపై జరుగుతున్న దాడుల ఘటనపై సాక్షిదినపత్రికలో 'కడుపున పుట్టినోళ్లా.. తోడేళ్లా..?' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆ ఘటనపై ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు విచారణ జరిపి, బాధితుల ఫిర్యాదు మేరకు మనోహర్‌రెడ్డి, సరస్వతమ్మపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### విద్యుత్ బిల్లుల వసూలు రూ.2 కోట్లు

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలో సోమవారం సెలవురోజు అయిన విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేశాయి. దీంతో మొత్తం 12,500 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించగా తద్వారా రూ.2 కోట్లు వసూలైనట్లు ట్రాన్స్‌కో ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు.

---

పలమనేరు ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పుంగనూరులో ప్రార్థనలు, బంగారుపాళెంలో చిన్నారుల ఆలింగనం





# ఈద్ ముబారక్



ఈద్ ముబారక్.. అల్లాహ్ ఆప్ కీ ఈద్ ఖుసీయోం ముబారక్ హోం ..అల్లాహ్ ఆప్ కీ దువాఏం ఖబూల్ కరే, ఔర్ ఆప్ ఔర్ ఆప్ కే ప్యారోం పర్ అప్నీ రహమతేం నాజిల్ కరే. ఈద్ ముబారక్! అంటూ ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. భక్తిశ్రద్ధలతో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఈద్గా మైదానం వరకు ర్యాలీలు చేసి, అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బంధుమిత్రులకు విందులు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా సోమవారం రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకున్నారు. – సాక్షినెట్‌వర్క్





చిత్తూరులో నమాజు చేస్తున్న ముస్లింలు

### జిల్లావ్యాప్తంగా 62 రిజిస్ట్రేషన్లు



చిత్తూరులో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న కొనుగోలుదారులు

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు రోజు అయినప్పటికీ పనిచేశాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి మాట్లాడుతూ మొత్తం 62 రిజిస్ట్రేషన్లు జరిగాయి, రూ.16.04 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సర ఆదాయ లక్ష్యం రూ.221 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.150.25 కోట్లు వచ్చినట్లు వివరించారు.

## క్లుప్తంగా

### రోడ్డుకు అడ్డంగా గోడ

**పుత్తూరు:** పాత గొడవల కారణంగా తన పొలం నుంచి ఇంటికి వెళ్లే దారిలో అడ్డంగా గోడ నిర్మించారంటూ పుత్తూరు పట్టణంలోని కట్టకిందరామకృష్ణాపురం గ్రామానికి చెందిన రైతు పి.గోవిందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు గోవిందరెడ్డి మాట్లాడుతూ తన పొలంలో పండించిన 14 బస్తాల ధాన్యం అద్దె ట్రాక్టర్ సాయంతో ఇంటికి తీసుకెళుతుండగా గ్రామానికి చెందిన ఎ.గోవర్ధన్, ఎ.చిరంజీవి అనే వ్యక్తులు అడ్డుకున్నారని ఆరోపించారు. పైగా తన పొలానికి అనుకుని రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిని ప్రశ్నిస్తే తనపై దాడికి యత్నించారని ఆరోపించారు. దీంతో ధాన్యం బస్తాలతో పాటు ట్రాక్టర్‌ను అక్కడే వదిలిపెట్టి రావాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును విచారిస్తున్నట్లు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**కార్వేటినగరం:** వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసు కున్న సంఘటన మండలంలోని చింతమండి వద్ద మామిడితోటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన దాసరి గణేష్ భవనిర్మాణ కాంట్రాక్టర్‌గా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమ వారం సాయంత్రం చింతమండి సమీపంలో రోడ్డుపై అతని ద్విచక్ర వాహనాన్ని ఆపి, అక్కడే ఉన్న ఓ మామిడి తోటలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు అతన్ని కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించా రు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మె రుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తర లించారు. సమాచారం అందుకున్న సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుస్తకాల డిపో దూరం..

# పంపిణీ అయోమయం!

**ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒకే పాఠ్యపుస్తకాల డిపో**

- ప్రస్తుతం దాన్ని మార్చే ఆలోచనలో విద్యాశాఖ
- ఇదే జరిగితే మరింత భారంతోపాటు సకాలంలో పుసకాలు అందడం కష్టమే

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యాశాఖకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఆ దిశగా కసరత్తు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాకు ఉన్న పుస్తకాల డిపో అద్దెభవనంలో కొనసాగడం.. దీన్ని ప్రస్తుతం తిరుపతి జిల్లాకు మార్చాలనే ఆలోచన చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇలా జరిగితే పాఠశాల తెరిచిన మొదటి రోజు విద్యార్థులకు పుస్తకాలు అందడం గగనమేనని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు ప్రభుత్వంపై పెనుభారం తప్పదని చెబుతున్నారు.

**గత ప్రభుత్వంలో నూతన డిపోలకు కసరత్తు**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పాఠశాలలతో పాటు అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంటుంది. తిరుపతి జిల్లా కేంద్రంలోని పుస్తకాల డిపో నుంచే ఉమ్మడి

తిరుపతి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ భవనంలో ఉన్న పాఠ్యపుస్తకాల డిపో




చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తుంటారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక ఆయా జిల్లాల్లో నూతన పాఠ్యపుస్తకాల డిపోలను ఏర్పాటు చేయాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన జిల్లాల్లో డిపోల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అయితే నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నూతన డిపోల ఏర్పాటు కసరత్తు మరుగున పడిపోయింది.

**కష్టతరమే**

ప్రస్తుతం తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న పాఠ్యపుస్తకాల డిపో నుంచి చిత్తూరు జిల్లాలోని కుప్పంకు 185.7 కి.మీ, తిరుపతి నుంచి పుంగనూరుకు 137.2 కి.మీ దూరం ఉంటుంది. ఇంత దూరంలో ఉన్న మండలాలకు వెసులుబాటును బట్టి పలు మార్లు పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రతి మండలానికి ప్రత్యేక వాహనాల్లో పుస్తకాలను పంపాల్సి ఉంటుంది. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలంటే కసరత్తును విద్యాసంవత్సరం ప్రారంభానికి ఐదు నెలలకు ముందే అమలు చేయాలి. చిత్తూరు జిల్లాలో కొత్తగా పుస్తకాల డిపోను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**తిరుపతి జిల్లా సమాచారం**

| పాఠశాల కేటగిరీ | పాఠశాలల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| ప్రాథమిక | 1,934 | 94,178 |
| ప్రాథమికోన్నత | 188 | 57,801 |
| ఉన్నత | 322 | 35,465 |
| మొత్తం | 2,444 | 1,87,444 |

**చిత్తూరు జిల్లా సమాచారం**

| పాఠశాల కేటగిరీ | పాఠశాలల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| ప్రాథమిక | 1,902 | 64,519 |
| ప్రాథమికోన్నత | 204 | 45,800 |
| ఉన్నత | 330 | 30,898 |
| మొత్తం | 2,436 | 1,41,217 |

**గత ప్రభుత్వంలో మొదటి రోజే పాఠ్యపుస్తకాలు**

ప్రభుత్వ విద్యార్థులకు బడులు తెరిచిన తొలిరోజే పాఠ్యపుస్తకాలు అందాయంటే ఆ ఘనత వైఎస్సార్‌సీపీ పాలనలోనే అని విద్యావేత్తలు చెబుతున్నారు. 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి ఉండేది కాదు. విద్యాసంవత్సరం పూర్తవుతున్నా పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేయని దుస్థితి ఉండేది. అలాంటి పరిస్థితులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపుమాపింది.

**పంపిణీకి కోట్లాది రూపాయల ఖర్చు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాలకు పాఠ్యపుస్తకాలను తిరుపతి పుస్తకాల డిపో నుంచే పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ డిపో ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో ఉండడంతో ఖాళీ చేయాలని యజమాని ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీంతో తిరుపతి జిల్లా కేంద్రంలోని పుస్తకాల డిపోను శ్రీకాళహస్తికి మార్పు చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అదే జరిగితే మరింత వ్యయంతో పాటు పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారనుంది.

> **కొత్త డిపో గుర్తించాలని గతంలో చెప్పారు**
>
> చిత్తూరు జిల్లాలో కొత్తగా పాఠ్యపుస్తకాల డిపోను గుర్తించాలని గతంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఆ మేరకు జిల్లా కేంద్రంలో కొన్ని భవనాలను పరిశీలించాం. ఆ తర్వాత నివేదికలు పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు రాలేదు. దీంతో మిన్నకుండిపోయాం. 2024–25 విద్యాసంవత్సరంలో తిరుపతి జిల్లా పాఠ్యపుస్తకాల డిపో నుంచే పుస్తకాలను పంపిణీ చేశారు. – వెంకటేశ్వరరావు, ఏడీ, డీఈవో కార్యాలయం, చిత్తూరు జిల్లా

### రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

– భర్తకు తీవ్రగాయాలు



ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న పాలట్యాంకర్

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలి వద్ద సోమవారం రాత్రి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని పాల ట్యాంక్ ఢీకొంది. ఈ సంఘటనలో భార్య మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తవణంపల్లె మండలం అరగొండ పైమాఘం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌శెట్టి, భార్య రాజేశ్వరి, మనవరాలు జ్యోతిక ద్విచక్రవాహనంపై మొగిలీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు మొగిలి గ్రామానికి వెళ్లారు. స్వామివారి దర్శనానంతరం వీరు స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. మొగిలి వద్ద రహదారి దాటుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న పాలట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్వరి(55)సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. చంద్రశేఖర్‌శెట్టి తీవ్రంగా గాయపడగా, జ్యోతిక స్వల్పంగా గాయపడింది. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్‌శెట్టిని మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



రాజేశ్వరి మృతదేహం, గాయపడిన చంద్రశేఖర్‌శెట్టి



ఏఎల్‌సీసీ చిత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చిత్రం దర్శకుడు, నటీ నటులు

### 25న ఏఎల్‌సీసీ విడుదల

**తిరుపతి కల్చరల్:** ఒక బ్యాచిలర్ తన జీవితంలో కష్టాలు ఎదుర్కొని ఎలా అనుకున్న లక్ష్యాన్ని సాధించారనే ఇతివృత్తంతో చక్కటి సందేశాత్మకంగా రూపొందించిన 'ఏఎల్‌సీసీ' సినిమా ఈనెల 25వ తేదీన విడుదలవుతుందని చిత్ర దర్శకుడు లీలీధర్ రావు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సినిమాకు సంబంధించిన పోస్టర్ స్టిల్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ చిత్రాన్ని 90 శాతం తిరుపతికి చెందిన నటీనటులతో తిరుపతి పరిసర ప్రాంతాల్లో రూపొందించామని తెలిపారు. బ్యాచిలర్‌గా ఉన్నప్పుడు జరిగే సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చేలా తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. సమావేశంలో నటీనటులు ధనుస్ దేవర, శ్రీనివాసులు రెడ్డి, కమల్, జశ్వంత్, చరణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.



### మున్సిపల్ చైర్మన్‌పై పోలీసు కేసు!

**పుత్తూరు:** స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, అతని కుమారుడు తులసిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏపీ ట్రాన్స్‌కో ఏఈ జైసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. మార్చి 29వ తేదీన స్థానిక ఈశ్వరాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా తమ విధులకు ఆటంకం కల్పించారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పేరిట ఒక దళితుడి దుకాణాన్ని కూల్చి వేయడాన్ని ప్రశ్నించినందుకే, టీడీపీ నాయకుల కక్షసాధింపులో భాగంగానే ఈ అక్రమ కేసు నమోదు చేయించారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి



లోహిత్ మృతదేహం

**పుంగనూరు:** రెండు రోజులు పాఠశాలలకు సెలవురావడంతో సరదాగా స్నేహితులుతో క్రికెట్ ఆడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పత్రపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పత్రపల్లెకు చెందిన పి.వాసు కుమారుడు పి.లోహిత్ (14) తన స్నేహితులతో కలసి గ్రామ సమీపంలో క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో విద్యుత్ లైన్లు కిందకు వేలాడుతున్నాయి. వీటిని గమనించకుండా క్రికెట్ ఆడుతూ కేరింతలు కొట్టే సమయంలో ప్రమాదవశాత్తు లోహిత్ కరెంట్‌షాక్‌కు గురై స్పృహతప్పాడు. తల్లిదండ్రుల సహాయంతో బాలుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడు మృతి చెందడంతో ఆగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### కోళ్ల టెంపో ఢీ.. తండ్రీకొడుకులకు గాయాలు



చికిత్సపొందుతున్న మురుగేష్, దేవేంద్ర

**గుడుపల్లె:** కోళ్ల టెంపో ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలైన ఘటన గుడుపల్లె మండలం చిన్నశెట్టిపల్లె వద్ద చోటు చేసుకుంది. గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. గుడుపల్లె మండలం కప్పలనత్తం గ్రామానికి చెందిన మురుగేష్, ఆయన కుమారుడు దేవేంద్ర ద్విచక్ర వాహనంలో కుప్పం బయలుదేరారు. మార్గం మధ్యలోని చిన్నశెట్టిపల్లె వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న కోళ్ల టెంపో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో తండ్రి మురుగేష్, కుమారుడు దేవేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం బంధువులకు సమాచారమిచ్చి, క్షతగాత్రులను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారని బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చేశామని శ్రీనివాసులు తెలిపారు.

### బిర్యానీ సెంటర్‌లో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న వంటశాల

**బంగారుపాళెం:** స్థానిక ఆర్‌కె బిర్యానీ సెంటర్‌లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. మొగిలివెంకటగిరికి చెందిన ఆర్‌కె బాషా బంగారుపాళెం బస్‌స్టాండ్ సమీపంలో బిర్యానీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వంటశాలలో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిసిపడి పక్కనే ఉన్న కట్టెలు అంటుకోవడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని చుట్టుపక్కల నివాసం ఉన్నవారు, దుకాణాల యజమానులు గుర్తించి, నిర్వాహకులకు సమాచారం అందించి, మంటలు అదుపు చేశారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వంట పాత్రలు, ఇతర వస్తువులు కాలిపోయాయి.

### గరుడుడిపై కోదండరాముడు



గరుడ వాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

**తిరుపతి కల్చరల్:** శ్రీకోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అడుగడుగునా భక్తులకు హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం మోహినీ అవతారధారుడైన శ్రీరామచంద్రమూర్తి పల్లకీలో కొలువై, పురవీధుల్లో ఊరేగారు. తర్వాత గరుడ పాదుకలను ఊరేగించారు. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళాప్రదర్శనలు**

సోమవారం రాత్రి నిర్వహించిన గరుడ సేవలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాబృందాల ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో కళాకారులు పాల్గొని, తమదైన శైలిలో సంగీత, నృత్య ప్రదర్శనలతో అబ్బురపరిచారు. బెంగళూరుకు చెందిన శ్రీపద్మావతి చెక్క భజన, కోలాటం, విశాఖపట్నంకు చెందిన భవదేయ ట్రస్ట్ సుగుణకుమారి 'దింసా'నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. అలాగే చంద్రగిరికి చెందిన 15 మంది చెక్క భజనతో మహిళా కళాకారులు, శ్రీగౌరీ శంకర కోలాట భజన అలరింపజేసింది. కడపకు చెందిన బాబు బృందం ప్రదర్శించిన డ్రమ్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

### నిరాశ పరచిన ఆస్తిపన్ను వసూళ్లు

**చిత్తూరు అర్బన్:** జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ ఏడాది ఆస్తి పన్ను వసూళ్లు ఆశాజనకంగా జరగలేదు. ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయని కూటమి ప్రభుత్వం 50 మాత్రమే వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్లు చివరలో ప్రకటించింది. ఫలితంగా ప్రజలు కూడా పన్నులు చెల్లించడంపై పెద్దగా ఆసక్తి చూపలేదు. పన్నులు చెల్లించడానికి సోమవారంతో గడువు ముగియగా.. చివరి రోజున జిల్లా వ్యాప్తంగా రూ.1.07 కోట్లు మాత్రమే వసూలైంది. ఇందులో అత్యధికంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కు రూ. 82 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మిగిలిన నాలుగు మున్సిపాలిటీలో రూ.20 లక్షల కూడా దాటలేదు.

### చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ మృతి



చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ (ఫైల్)

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (డీవైఈఓ)గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులు ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. చిత్తూరు డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఆయన కృషి చేశారు. టీచర్లు ఏవైనా సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఉమ్మడి చిత్తూ రు జిల్లాగా ఉన్న సమయంలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో సీనియర్ హెచ్‌ఎం ఆయనే కావడంతో డీవైఈఓగా నియమించారు. డీవైఈఓ ఆకస్మిక మృతి పట్ల కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఈఓ వరలక్ష్మి సంతాపం వ్యక్తం చేశా రు. వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే డీవైఈఓ మృతి చెందడం విద్యాశాఖకు తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు మండలం దేవలచేను గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు చంద్రశేఖర్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు.

**మృతి బాధాకరం**

డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మిక మృతి బాధాకరమని ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. పాత కలెక్టరేట్‌లోని డీవైఈఓ కార్యాలయం వద్ద సోమవారం డీవైఈఓ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీవైఈఓ ఆత్మకు శాంతి చేకూరాలని కాసేపు మౌనం పాటించారు. అనంతరం హెచ్‌ఎం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డీవైఈఓ చంద్రశేఖర్ మృతి విద్యాశాఖకు, తమకు తీరని లోటన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఆయన తమకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సెల్వరాజ్, త్యాగరాజరెడ్డి, గణపతి, హెచ్‌ఎంలు రవి, తులసిబాబు, భాస్కర్, డీవైఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ తులసి తదితరులు పాల్గొన్నారు.



డీవైఈఓ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

# నిఘా నీడలోనేనా?

- రేపటి నుంచి ఎస్వీయూ డీడీఈ పరీక్షలు
- రాష్ట్ర వ్యాప్తంగా 43, ఇతర రాష్ట్రాలలో 8సెంటర్లలో పరీక్షలు
- హాజరుకానున్న 32 వేల మంది అభ్యర్థులు
- డెబ్ నిబంధనలు పాటించకుంటే కోర్టును ఆశ్రయిస్తామంటున్న విద్యార్థి సంఘాలు




ఎస్వీయూ డీడీఈ భవనం

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ దూరవిద్యా కేంద్రం పరిధిలో యూజీ, పీజీ పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఏడాదిగా సుమారు నాలుగు దఫాలుగా వాయిదా పడిన ఈ పరీక్షలు ఎట్టకేలకు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పరీక్షల నిర్వహణలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని, అవినీతి రాజ్యమేలుతోందని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థలలో పరీక్షలు నిర్వహించేందుకు పూనుకున్నారని విద్యార్థి సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. యూజీసీ డెబ్ నిబంధనలకు లోబడి పరీక్షలను ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహించాలని వర్సిటీ అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాలలోనూ, ఇతర రాష్ట్రాలలో మరో 8 సెంటర్లలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ పరీక్షలకు సుమారు 32 వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

**తప్పని తిప్పలు**

డీడీఈ నిబంధనల ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 15 రోజుల ముందుగానే హాల్‌టికెట్లు జారీ చేయాల్సి ఉంది. కానీ అధికారులు పరీక్షలకు మూడు రోజుల ముందు శనివారం రోజు నుంచి హాల్‌టికెట్లును ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. దీంతో ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. తమకు శనివారం రోజున హాల్‌టికెట్లు అందిస్తే పనిచేస్తున్న కంపెనీలలో సెలవుకు దరఖాస్తు చేసుకుని సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం సాధ్యమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు స్టడీ సెంటర్ల నిర్వాహకులను సంప్రదించి తమగోడును విన్నవించుకుంటున్నారు. వర్సిటీ అధికారులు కనీసం అభ్యర్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం దారుణమని మండిపడుతున్నారు.

**డెబ్ నిబంధనలు అమలయ్యేనా?**

డీడీఈ పరీక్షలు యూజీ డెబ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇప్పటికే న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలతో పాటు వీడియో రికార్డింగ్ చేపట్టి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. కానీ బుధవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టని పక్షంలో విద్యార్థి సంఘాలు మరోమారు న్యాయస్థానాల తలుపు తట్టేందుకు సిద్ధమవుతున్నారు. మాస్ కాపీయింగ్‌ను పూర్తి స్థాయిలో అరికట్టి నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. పరీక్షా కేంద్రాలను కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో మాత్రమే నిర్వహించాల్సి ఉందని డెబ్ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

> **నిబంధనల మేరకే పరీక్షలు**
>
> 
>
> యూజీసీ నిబంధనల మేరకు ప్రభుత్వ కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాం. అదే కళాశాలలో పని చేసే అధ్యాపకులనే ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నాం. దీంతో పాటు పరీక్షా కేంద్రాలలో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం.
> – ఊక రమేష్‌బాబు, డైరెక్టర్, డీడీఈ, ఎస్వీయూ